
సాక్షి గుంటూరు

ఆదివారం। 19। నవంబర్। 2023



సబ్‌జైలు పరిశీలన

తెనాలిరూరల్: తెనాలి సబ్‌జైలును రెండో అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ జె. శ్రీసీత శనివారం పరిశీలించారు. జైలు ఆవరణను పరిశీలించి ఖైదీల వసతుల గురించి ఆరాతీశారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 2423 క్యూసెక్కులు విడుదల చేశారు.



దుర్గమ్మ సేవలో విద్యావతి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కేంద్ర పర్యాటక శాఖ కార్యదర్శి వి.విద్యావతి శనివారం ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

మల్లేశ్వరుని సన్నిధిలో హైకోర్టు జడ్జి



పెదకాకాని: శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వారిని దర్శించుకునేందుకు రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి వి.గోపాలకృష్ణారావు దంపతులు శనివారం దేవస్థానానికి విచ్చేశారు. అధికారులు, పాలకమండలి చైర్మన్ అమ్మిశెట్టి శివ శంకరరావు, ఆలయ అర్చకులు, వేదపండితుల మంత్రోచ్చారణ, మేళ తాళాలతో హైకోర్టు న్యాయమూర్తి దంపతులకు స్వాగతం పలికారు. న్యాయమూర్తి దంపతులు భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక అభిషేకం, కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. అనంతరం స్వామివారి శేషవస్త్రంతో ఘనంగా సత్కరించారు.

పీజీఎస్ సర్టిఫికేషన్‌పై అవగాహన



తెనాలి: ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు పీజీఎస్ ఇండియా ఆర్గానిక్ సర్టిఫికేషన్ తీసుకోవటం వల్ల బహుళ ప్రయోజనాలు ఉంటాయని సుస్థిర వ్యవసాయ కేంద్రం(సీఎస్‌ఏ) రాష్ట్ర కో-ఆర్డినేటర్ లక్ష్మి కన్నెగంటి అన్నారు. కొల్లిపర మండంలోని దావులూరు, అత్తోట, తూములూరు, చక్రాయపాలెం గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల పంట భూములను శనివారం ఆమె సందర్శించారు. సేంద్రియ ధ్రువీకరణ విధానం, పీజీఎస్ ఇండియా ఆర్గానిక్ సర్టిఫికేషన్ పొందటానికి తీసుకోవలసిన చర్యలను గురించి రైతులకు వివరించారు. తగిన సలహాలు, సూచనలు చేశారు. ప్రకృతి వ్యవసాయ విభాగం మార్కెటింగ్ అండ్ సర్టిఫికేషన్ ఎస్ఎఫ్ఏ సుమ, జిల్లా అగ్రి అడ్వయిజర్ బోర్డు మెంటర్ జి.శ్రీధర్, సిబ్బంది నాగజ్యోతి, పరిశుద్ధకుమారి, సత్యనారాయణ పాల్గొన్నారు.

వృద్ధుడి దారుణ హత్య

గొంతు కోసి పరారైన గుర్తుతెలియని వ్యక్తులు



గురజాల: వృద్ధుడి గొంతు కోసి హత్య చేసిన సంఘటన మండలంలోని కొత్తఅంబాపురం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన పత్తి రామారావు (73)ను గుర్తుతెలియని వ్యక్తులు ఇంటిలో గొంతు కోసి హత్య చేశారు. మృతుడి భార్య హైదరాబాద్‌లో ఉంటుండగా, ఇద్దరు సంతానం అమెరికాలో నివాసం ఉంటున్నట్లు సమాచారం. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు సంఘటనా స్థలాన్ని డీఎస్పీ పల్లపురాజు, సీఐ బాలకృష్ణ, ఎస్‌ఐలు అశోక్, బి.అనంత కృష్ణలు పరిశీలించారు. డీఎస్పీ పల్లపురాజు మాట్లాడుతూ హత్య ఎవరూ చేశారు.. కారణాలు ఏమిటి అన్న విషయాలను విచారించనున్నట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం రామారావు మృతదేహాన్ని గురజాల సామాజిక ఆరోగ్య కేంద్రంకు తరలించారు.

రేపు కుల గణనపై ప్రాంతీయ సదస్సు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఈనెల 20వ తేదీన విజయవాడలో కుల గణన - 2023 పై ప్రాంతీయ సదస్సు జరుగుతుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. సదస్సు ఏర్పాట్లపై కలెక్టర్ శనివారం అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్టెల్లా కళాశాల సమీపంలోని మెట్రోపాలిటన్ హోటల్‌లో ప్రాంతీయ సదస్సు జరుగుతుందన్నారు. ఎన్టీఆర్ జిల్లాతోపాటు కృష్ణా, బాపట్ల, పల్నాడు, గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులు, కుల సంఘాల ప్రతినిధులు హాజరవుతారన్నారు.

ప్రజా సంక్షేమం కోసమే కులగణన

- జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి
- రెవెన్యూ కల్యాణమండపంలో కులగణన - 2023 సదస్సు
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, వివిధ కుల సంఘాల నేతలు



కులగణన -2023 సదస్సుకు హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు, కుల సంఘాల నేతలు



మాట్లాడుతున్న డొక్కా మాణిక్యవరప్రసాద్, వేదికపై కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు

గుంటూరు వెస్ట్: ప్రజల సంక్షేమానికి అవసరమైన పాలసీలను రూపొందించేందుకు కులగణన ఉపయోగపడుతుందని ప్రజల సంక్షేమం కోసమే కులగణన అని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక రెవెన్యూ కల్యాణ మండపంలో ఏపీ స్టేట్ కులగణన-2023 పై స్టేక్ హోల్డర్స్ స్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ 1931లో దేశంలో తొలిసారి బ్రిటిష్ కాలంలో కులగణన జరిగిందన్నారు. ఇటీవల బిహార్ రాష్ట్రంలో చేపట్టారన్నారు. అసంఖ్యాకంగా ఉన్న వెనుకబడ్డ తరగతుల వివరాలు, జనాభా ప్రకారం సంఖ్య తీసుకుని మరిన్ని మెరుగైన పాలసీలను రూపొందించేందుకు కులగణనకు ఇటీవల రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. ఈ క్రమంలోనే కుల సంఘ నాయకులు, మేధావులతో సమావేశాలు నిర్వహిస్తుందన్నారు. వారి సూచనలు, సలహాలను ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. ఈ నెల 26 నుంచి వారం రోజుల పాటు కులగణన జరుగుతుందన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు వివరాలు సేకరిస్తారని చెప్పారు. ఈ సర్వేలో పాల్గొనే సిబ్బందికి పూర్తి శిక్షణనిచ్చామన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం చేయలేని పనిని రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో వెనుకబడిన అనేక వర్గాలకు పదవులు లభించాయన్నారు.

గొప్ప ముందడుగు..

సమావేశానికి హాజరైన కుల సంఘాల నాయకులు, మేధావులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏపీ స్టేట్ కులగణన-2023 గొప్ప ముందడుగన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి కొన్ని కులాలు ఎదిగాయని, మరికొన్ని కులాలు బాగా అణిచివేయబడ్డాయన్నారు. కులగణన ద్వారా జనాభా లెక్కతోపాటు హక్కులు కూడా సంక్రమిస్తాయని చెప్పారు. దీనిని చిత్తశుద్ధితో పూర్తి చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చర్యలకు తమ మద్దతుంటుందని పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, డీఆర్‌ఓ చంద్రశేఖరరావు, ఆర్డీఓ పి.శ్రీకర్, సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూధనరావు, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, కృష్ణ బలిజ, పూసల కార్పొరేషన్ చైర్‌పర్సన్ కోలా భవాని, విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ ముంతాజ్ పఠాన్, టిడ్కో డైరెక్టర్ కె.నాగేశ్వరి, ఆర్అండ్‌బీ డైరెక్టర్ పిల్లిమేరి పాల్గొన్నారు.

క్రీడలకు అధిక ప్రాధాన్యం

- వెనిగండ్ల జెడ్పీ హైస్కూల్‌లో ప్రారంభమైన రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు
- పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్సీ టి.కల్పలతారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ టి.కల్పలతారెడ్డి

పెదకాకాని: రాష్ట్రప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యమిస్తుందని, క్రీడాభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలని ఎమ్మెల్సీ టి.కల్పలతారెడ్డి అన్నారు. పెదకాకాని మండలంలోని వెనిగండ్ల జిల్లా పరిషత్ పాఠశాలలో మూడు రోజులు జరగనున్న అండర్-14 బాల బాలికల రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీల కార్యక్రమానికి హెచ్ఎం నంబూరు తిరుపతిరావు అధ్యక్షత వహించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ టి.కల్పలతారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యతోపాటు క్రీడలనూ ప్రోత్సహిస్తుందన్నారు. తొలుత జాతీయ జెండా, గేమ్స్ జెండా ఎగురవేశారు. జిల్లాల వారీగా 13 జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు ప్ల కార్డులు, జెండాలతో మార్చ్‌ఫాస్ట్ చేశారు. చివరిగా క్రీడా ప్రతిజ్ఞ అనంతరం క్రీడలు ప్రారంభించడం జరిగింది. ఏపీ టెస్ట్ బుక్స్ డైరెక్టర్ రవీంద్రనాథ్ రెడ్డి, టోర్నమెంట్ డైరెక్టర్ మస్తాన్‌రెడ్డి, డాక్టర్ ఎస్‌కే మహబూబ్ బాషా, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ ప్రతాపరెడ్డి, శివాలయం చైర్మన్ అమ్మిశెట్టి శివ శంకరరావు పాల్గొన్నారు.

13 చోరీ కేసుల్లో ఇద్దరు నిందితుల అరెస్ట్

రూ.20 లక్షల విలువైన సొత్తు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నగలతో ఏసీపీ జనార్దన్ నాయుడు

నందిగామ: తరచూ పలు ప్రాంతాలలో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను నందిగామ పోలీసులు వల పన్ని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.20 లక్షల విలువ చేసే సొత్తు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి శనివారం నందిగామ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏసీపీ జనార్దన్ నాయుడు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చీరాలకు చెందిన షేక్ అల్తాఫ్ ఏడవ తరగతి వరకు చదువుకున్నాడు. కూలి పనులు చేసుకుంటూ జీవించే అల్తాఫ్ కొంతకాలంగా జల్సాలకు అలవాటు పడ్డాడు. ఈ క్రమంలో తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి దొంగతనాలు చేయడం ప్రారంభించాడు. చోరీ కేసులో జైలులో ఉన్న సమయంలో కంచికచర్లకు చెందిన మణికంఠ అల్తాఫ్‌కు పరిచయమయ్యాడు. వారిద్దరూ కలిసి నందిగామ పోలీస్ స్టేషన్ పరిధిలో 4, జగ్గయ్యపేట స్టేషన్ పరిధిలో 1, వత్సవాయి పోలీస్ స్టేషన్ పరిధిలో 1, కంచికచర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో 1, ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో 1, తెలంగాణ రాష్ట్రం కోదాడ పోలీస్ స్టేషన్ పరిధిలో 2, నేలకొండపల్లిలో 1, ఖమ్మం త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 1, హస్తినాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక దొంగతనం చొప్పున మొత్తం 13 చోట్ల తాళం వేసి ఉన్న ఇళ్ల, దుకాణాలలో చోరీకి పాల్పడినట్లు తెలిపారు. ఆయా చోరీలలో వారు దొంగిలించిన 156 గ్రాముల బంగారు ఆభరణాలు, 8.820 కేజీల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు చోరీలకు ఉపయోగించిన కారు, బైకులతో పాటు వారి వద్ద నుంచి రూ.40 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వాటి మొత్తం విలువ రూ.20 లక్షల వరకు ఉంటుందని ఏసీపీ తెలిపారు.

బంగారం చోరీ కేసులో నిందితులకు మూడేళ్ల జైలు

- 17 ఏళ్ల క్రితం నరసరావుపేట చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకులో ఘటన
- సుదీర్ఘ విచారణ అనంతరం జైలుశిక్ష, జరిమానా విధింపు

నరసరావుపేట: నరసరావుపేట చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకులో రైతులు తనఖా పెట్టి రుణం పొందిన రూ.3.75కోట్ల విలువైన బంగారాన్ని చోరీచేసిన కేసులో నలుగురు నిందితులకు మూడేళ్ల జైలు, ఒక్కొక్కరికి రూ.20వేలు జరిమానా విధిస్తూ మొదటి అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ ఇన్‌చార్జి న్యాయమూర్తి ఆర్.ఆశీర్వాదం పాల్ శనివారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం ఈ చోరీ 2006 డిసెంబరు 26వ తేదీన వెలుగులోకి వచ్చింది. డిసెంబరు 23, 24, 25 తేదీలు వరుసగా సెలవులు రావటంతో నిందితులైన పఠాన్ ఖాజాబాబు, పఠాన్ జానీబాషా, షేక్ సుభాని, షేక్ అబ్దుల్ ఖాదర్ అవకాశంగా తీసుకొని గ్యాస్ కట్టర్లతో బ్యాంకు తలుపులు, స్ట్రాంగ్‌రూమ్ తలుపులను కత్తిరించి బంగారం చోరీకి పాల్పడ్డారు. 26వ తేదీన బ్యాంకుకు వచ్చిన సిబ్బంది చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. శిక్ష పడిన ఖాజాబాబు బ్యాంకులో అప్రైజర్‌గా పనిచేసిన వ్యక్తి కుమారుడు కావటం గమనార్హం. ఈ సంఘటన అప్పట్లో సంచలనం సృష్టించింది. మొత్తం ఎనిమిది మందిని నిందితులుగా గుర్తిస్తూ చార్జిషీట్ దాఖలు చేయగా, 2009లో వీరిలో నలుగురిని కేసు నుంచి తొలగించారు. సుమారు 17 ఏళ్ల సుదీర్ఘ విచారణ అనంతరం నిందితులకు జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు వెలువరించింది. ప్రాసిక్యూషన్‌ను లక్ష్మీరామ్‌నాయక్ నిర్వహించారు.

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో...

గ్రూప్-1, 2 ఉద్యోగ పరీక్షలపై

ఉచిత అవగాహన సదస్సు

- డిసెంబర్ 2వ తేదీన గుంటూరులో సదస్సు
- గెస్ట్ స్పీకర్‌గా సివిల్స్ విజేత బాలలత
- లక్ష్యం: గ్రామీణ, పట్టణ విద్యార్థులకు గ్రూప్-1,2 పరీక్షలపై అవగాహన కల్పించడం

సాక్షి ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రూప్-1,2 ఉద్యోగాల భర్తీకి త్వరలోనే ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో గ్రామీణ, పట్టణ విద్యార్థులను గ్రూప్-1,2 స్థాయి ఉద్యోగులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో సాక్షిఎడ్యుకేషన్.కామ్ (www. sakshieducation. com) ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ఉచిత అవగాహన సదస్సులను నిర్వహించనుంది. గత కొన్ని సంవత్సరాలుగా వివిధ పోటీపరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు సాక్షిఎడ్యుకేషన్.కామ్ తోడుగా ఉంటున్న విషయం అందరికీ తెల్సిందే.

గెస్ట్ స్పీకర్‌గా బాలలత..

ఎంతో మందిని పోటీ పరీక్షల్లో విజేతలుగా తీర్చిదిద్దుతున్న సివిల్స్ టాపర్ బాలలత గారు గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సుకు గెస్ట్ స్పీకర్‌గా హాజరుకానున్నారు. ఆమె గ్రూప్ 1,2 పరీక్షలపై అవగాహన కల్పించడంతో పాటు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయనున్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 8977625795 ఫోన్ నెంబర్‌కు పేరు, ఫోన్ నెంబర్, జిల్లా వివరాలను వాట్సాప్‌లో పంపగలరు.

అవగాహన సదస్సు తేదీ
డిసెంబర్ 2, 2023(శనివారం)

వేదిక	సమయం
ఆంధ్ర క్రిస్టియన్ కాలేజీ (ఏసీ కాలేజీ), గవర్నమెంట్ ఆసుపత్రి పక్కన, సాంబశివ పేట, మెయిన్ రోడ్, గుంటూరు	ఉదయం 9.30 నుంచి 12.30 వరకు

వివరాలకు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ : 8977625795

భారీ స్క్రీన్‌పై ప్రపంచ కప్ ఫైనల్ పోరు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): వన్‌డే ప్రపంచ కప్ క్రికెట్ పోరును భారీ స్క్రీన్‌పై వీక్షించే అవకాశాన్ని కల్పిస్తున్నామని క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి దాసరి రమేష్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 1:30 నుంచి మ్యాచ్ ముగిసే వరకు స్థానిక అరండల్‌పేటలోని పిచ్చుకులగుంట క్రీడా మైదానంలో 15 అడుగుల వెడల్పు 10 అడుగుల పొడవు వున్న ఎల్‌ఈడీ స్క్రీన్‌తోపాటు కూర్చుని వీక్షించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రవేశం ఉచితమని చెప్పారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ క్రికెట్‌ను మరింత ప్రోత్సహించేందుకు ఈ ప్రత్యేక ఏర్పాట్లు చేసిందని వెల్లడించారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 524.50 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎడమకాలువకు 5,297, ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 27,440, ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 841.00 అడుగుల వద్ద ఉంది.

21,22 తేదీల్లో మెప్మా ఉత్పత్తుల ప్రదర్శన

నెహ్రూనగర్: మెప్మా ఆధ్వర్యంలో ఈ నెల 21, 22 తేదీల్లో స్వయం సహాయక సంఘ సభ్యులు చేత తయారు చేయబడిన ఉత్పత్తుల ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు మెప్మా పీడీ పి వెంకట నారాయణ శనివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. స్థానిక ఏసీ కాలేజీ ఎదురుగా ఉన్న స్టేట్ రీజనల్ లైబ్రరీ ప్రాంగణంలో ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందన్నారు.

కులగణనతో సామాజిక న్యాయం

- సాహసోపేత నిర్ణయం తీసుకున్న సీఎం వైఎస్ జగన్
- రాజకీయాల్లో ప్రతి కులానికి వాటా లభిస్తుంది
- రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్



కొరిటిపాడు(గుంటూరు): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న కులగణనతో సామాజిక న్యాయం సాధ్యమవుతుందని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ నాయక్ అన్నారు. గుంటూరులోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్ సీపీ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ప్రజల్లో ఆత్మ గౌరవం పెరిగిందన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న కులగణన గురించి వంద సంవత్సరాలు చెప్పుకుంటారన్నారు. బ్రిటీష్ వారి హయాంలో చేపట్టిన కులగణనను కూడా మన దేశంలో మూడు శాతంగా ఉన్న అగ్రకులాలే అడ్డుకున్నాయని తెలిపారు. కులగణన నాలుగేళ్లకు కూడా పూర్తి కాదని కొందరు అంటున్నారని, అసాధ్యాన్ని సుసాధ్యం చేసి చూపించడం ముఖ్యమంత్రికే సాధ్యమన్నారు. రాష్ట్రంలో రెండు రోజుల్లో ఫీవర్ సర్వేను చేసి చూపించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. క్షేత్రస్థాయిలో ఉన్న సచివాలయ వ్యవస్థ ద్వారా ఏడు రోజుల్లో కులగణన సర్వే పూర్తవుతుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. వందేళ్ల అనంతరం రాష్ట్రంలో కులగణన చేపట్టేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాహసోపేత నిర్ణయం తీసుకున్నారన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధన దిశగా సీఎం జగన్ అడుగులు వేస్తున్నారని వెల్లడించారు. కులగణనతో అన్ని వర్గాల ప్రజలకూ న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. ఏ కులంలో ఎంతమంది జనాభా ఉన్నారనేది స్పష్టంగా వెల్లడవుతుందని తెలిపారు. కులగణన పూర్తి నివేదిక తయారైన తరువాత అందుకు తగ్గ రిజర్వేషన్లు తదితర వాటిల్లో సమన్యాయం పాటించడానికి అవకాశం ఉంటుందని వెల్లడించారు. రాష్ట్ర కేబినెట్‌లో 25 మంది మంత్రులు ఉంటే 17 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందినవారేనన్నారు. ముఖ్యమంత్రి చొరవతో 56 వివిధ కులాలకు చెందిన కార్పొరేషన్లు ఏర్పాటయ్యాయని గుర్తు చేశారు. అనేక కులాలు అభివృద్ధి చేయాలనే సదుద్దేశంతో ముఖ్యమంత్రి తీసుకున్న ఈ నిర్ణయానికి ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని కోరారు.

దివ్యాంగులకు బజరంగ్ భరోసా

బజరంగ్ సీఈవో అంబటి మురళీకృష్ణ



మామిళ్లపల్లిలో దివ్యాంగుని యోగక్షేమాలు తెలుసుకుంటున్న బజరంగ్ ఫౌండేషన్ సీఈవో అంబటి మురళీకృష్ణ

చేబ్రోలు: బజరంగ్ ఫౌండేషన్ విభిన్న ప్రతిభావంతులకు భరోసా నివ్వటం కోసం దివ్యాంగ దర్శిని పేరిట సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు బజరంగ్ ఫౌండేషన్ సీఈవో అంబటి మురళీకృష్ణ అన్నారు. చేబ్రోలు మండలం మంచాల, చెరువులోపాలెం, పొన్నూరు మండలం మామిళ్లపల్లి గ్రామాల్లోని దివ్యాంగులను శనివారం ఆయన పరామర్శించి వారికి చేయూతను ఇవ్వనున్నట్లు తెలిపారు. చెరువులోపాలెంకు చెందిన ముట్లూరు శ్యాంసన్ రోడ్డు ప్రమాదంలో కాలు కొంత బాగం కోల్పోయాడు. మంచాల గ్రామానికి చెందిన పంద్రంగి సురేష్ అనారోగ్య కారణాలతో కాలు కొంత బాగం తొలగించారు. నిరుపేద కుటుంబానికి చెందిన వీరిని అంబటి మురళీకృష్ణ పరామర్శించి వీరికి జైపూర్ పాదాలు అందించి వారు కాళ్లమీద వారు నిలబడే విధంగా తోడ్పాటును అందించనున్నట్లు తెలిపారు. వీరికి ఇంటి ప్రాంగణంలో వెస్టన్ కమోట్‌ను కూడా నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. పొన్నూరు మండలం మామిళ్లపల్లి గ్రామానికి చెందిన పఠాన్ కరీముల్లా పోలియో మహమ్మారి కారణంగా అంగవైకల్యం బారిన పడ్డాడు. కరీముల్లాకు ట్రై సైకిల్‌ను అందించనున్నట్లు తెలిపారు. వారం రోజుల్లో పేరామర్శించిన ముగ్గురికి బజరంగ్ దివ్యాంగ దర్శిని సేవా కార్యక్రమం ద్వారా జైపూర్ పాదాలు, ట్రై సైకిల్ అందించనున్నట్లు అంబటి మురళీకృష్ణ తెలిపారు. దివ్యాంగులకు చేయూతనివ్వటానికి బజరంగ్ ఫౌండేషన్ సన్నద్ధంగా ఉందని, సాయం కోరిన వెంటనే వారి నివాసానికి వచ్చి వారి స్థితిగతులను బట్టి తక్షణమే సహాయ సహకారాలను అందించనున్నట్లు తెలిపారు. స్థానికులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రైళ్లలో డీఆర్‌ఎం తనిఖీలు



లక్ష్మీపురం: సౌత్ సెంట్రల్ రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని రైల్వే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డివిజన్ పరిధిలోని పలు రైళ్లను తనిఖీలు చేయడం జరిగిందని గుంటూరు రైల్వే డివిజన్ డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ అన్నారు. శనివారం గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని పల్నాడు, ఫలుక్‌నామ, గరిబ్‌రథ్, మాచర్ల రైళ్లను గుంటూరు రైల్వే స్టేషన్‌లో గుంటూరు డివిజన్ డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ, ఏడీఆర్‌ఎం సైమాన్, డివిజన్ సెక్యూరిటీ కమిషనర్ హర ప్రసాద్ స్వయంగా తనిఖీలు చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ తనిఖీలు ప్రధానంగా గత కొద్ది రోజులుగా దీపావళి పండుగను పురస్కరించు కుని పేలుడు పదార్థాలను రైళ్లలో సరఫరా చేస్తున్నట్లు ఉన్నతాధికారులకు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు తనిఖీలు చేస్తున్నామన్నారు. గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని నవంబర్ మొదటి తేదీ నుంచి ఇప్పటి వరకు సుమారు 800 రైళ్లలను తనిఖీ చేసి రెండు కేసులు బనాయించడం జరిగిందన్నారు.

ఏసీ లా కళాశాలలో యథావిధిగా ప్రవేశాలు

కళాశాల కరస్పాండెంట్ జి.ఎలీషా



గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని ఏసీ లా కళాశాలలో ప్రస్తుత విద్యాసంవత్సరంలో యథావిధిగా ప్రవేశాలు కల్పిస్తున్నట్లు కళాశాల కరస్పాండెంట్ జి. ఎలీషా తెలిపారు. శనివారం ఏసీ లా కళాశాలలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఎలీషా మాట్లాడుతూ ఏపీ ఉన్నత విద్య ఫీజుల నియంత్రణ కమిషన్‌కు తమ కళాశాల నుంచి సకాలంలో ఫీజుల వివరాలను సమర్పించకపోవడంతో కమిషన్ ఆదేశాల మేరకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి లా-సెట్ కౌన్సెలింగ్ నుంచి కళాశాలను తొలగించిందని చెప్పారు. అయితే గత ప్రిన్సిపాల్ వ్యవహరించిన తీరుతో జరిగిన నష్టాన్ని గుర్తించిన కళాశాల యాజమాన్యం ఫీజుల నియంత్రణ కమిషన్ కోరిన వివరాలను సమర్పించినట్లు వివరించారు. దీంతో పాటు తమ కళాశాలలో లా-సెట్ ద్వారా యథావిధిగా ప్రవేశాలు నిర్వహించుకునేందుకు వీలుగా అనుమతించాలని కోరుతూ, ఇటీవల హైకోర్టులో దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై కళాశాలకు అనుకూలంగా తీర్పు వచ్చిందని చెప్పారు. మైనార్టీ విద్యా సంస్థగా ఉన్న ఏసీ లా కళాశాలలో లా-సెట్ కౌన్సెలింగ్ ద్వారా విద్యార్థులకు ప్రవేశాలు కల్పించడంతో పాటు ప్రభుత్వం విడుదల చేసిన షెడ్యూల్ మేరకు ఈనెల 30 నుంచి తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. 49 ఏళ్ల చరిత్ర కలిగిన ఏసీ లా కళాశాల గోల్డెన్ జూబ్లీ వేడుకలను వచ్చే ఏడాది జనవరి-ఫిబ్రవరి మధ్య ఘనంగా నిర్వహించేందుకు ఏఈఎల్‌సీ సన్నాహాలు చేస్తోందని, కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులు తమవంతు భాగస్వామ్యం అందించాలని కోరారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ అమృత వర్షిణి, వైస్ ప్రిన్సిపాల్ కిరణ్ పాల్గొన్నారు.